చదువు

10 ■ e-mail: edc@eenadu.in

హైదరాబాద్ ఈనాడు

బుధవారం డిసెంబరు 13, 2023

ఏక కాలంలో రెండు డిగ్రీలు..

ఒకే సబ్జెక్టుపై రెండు డిగ్రీలను ఏకకాలంలో (2010–2013) చదివాను. ఒకటి రెగ్యులర్‌గా, మరోటి దూరవిద్యా విధానంలో. ప్రభుత్వ ఉద్యోగానికి ఏ డిగ్రీ సర్టిఫికెట్ చెల్లుబాటవుతుంది? - మహేష్

■ ఒకే సమయంలో రెండు డిగ్రీలు చదవడానికి యూజీసీ 2022 నుంచి మాత్రమే అనుమతి ఇచ్చింది. అంతకుముందు రెండు డిగ్రీలు ఏక కాలంలో చేసివుంటే, వాటిలో ఒక డిగ్రీ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. మీరు ఒకే సబ్జెక్టుతో రెండు డిగ్రీలు చేయడానికి ఉన్న కారణాలు చెప్పలేదు. ఆ రెండు డిగ్రీలూ ఒకే యూనివర్సిటీ నుంచి చేశారా, వేర్వేరు వర్సిటీల నుంచి చేశారో తెలియదు. యూజీసీ గుర్తింపు ఉన్న యూనివర్సిటీ నుంచి చేసిన రెగ్యులర్ డిగ్రీకీ, దూరవిద్య డిగ్రీకీ మధ్య తేడా లేదు. ఈ రెండు రకాల డిగ్రీలు చదివినవారు కూడా ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మీరు ఏదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు 'మీరు డిగ్రీని దూరవిద్య ద్వారా ఎందుకు చేశారు?' అనే ప్రశ్న ఎదురవుతుంది. మీకు ఏ డిగ్రీలో ఎక్కువ మార్కులు వచ్చాయో, ఆ డిగ్రీని ఉపయోగించుకోండి. ఒకవేళ మీరు రెండు డిగ్రీలూ వేర్వేరు యూనివర్సిటీల నుంచి చేస్తే, మెరుగైన న్యాక్ స్కోరు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు ఉన్న యూనివర్సిటీ డిగ్రీని ఉపయోగించుకొనే ప్రయత్నం చేయండి.

– ప్రా. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్



సివిల్ సర్వీసెస్ పర్సనాలిటీ టెస్ట్

సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్ష ఫలితాలను యూపీఎస్‌సీ ఇటీవలే ప్రకటించింది. దీంట్లో అర్హత సాధించిన అభ్యర్థులందరూ పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు హాజరవుతారు. పరీక్ష ఫలితాలు వెలువడిన నెల రోజుల్లోపే ఈ మౌఖిక పరీక్షలు ప్రారంభమవుతాయి. కీలకమైన ఈ తుది అంచెపై సరైన అవగాహన తాజా అభ్యర్థులకూ, సివిల్స్ లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులకూ తప్పనిసరి.

ఇదిగో.. ఇంటర్'వ్యూహం'!

సివిల్స్ ఎంపిక ప్రక్రియలో మౌఖిక పరీక్షకు యూపీఎస్‌సీ ఎంతో ప్రాముఖ్యం ఇస్తుంది. ఎందుకంటే.. సెలక్షన్/ రిక్రూట్‌మెంట్ విధానంలో.. రాత పరీక్ష ప్రాథమికంగా అభ్యర్థి మేధా నైపుణ్యానికి నిదర్శనంగా ఉంటుంది. అంతేగానీ అభ్యర్థి స్వభావం, సహానుభూతి, భావోద్వేగ ప్రజ్ఞ, ప్రేరణాత్మక వైఖరి, విలువల వ్యవస్థ గురించి తెలియజేయదు. ప్రిలిమినరీలో ఉండే ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అభ్యర్థికి ఉండే విస్తృత ఆలోచనా పరిధినీ, జ్ఞాపకశక్తినీ ప్రతిబింబిస్తాయి. మెయిన్‌లోని షార్ట్ ఆన్సర్ తరహా ప్రశ్నలు.. ప్రత్యేక అంశాలను సాధారణీకరించి, సహేతుకంగా రాసే సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. అయితే ప్రిలిమినరీగానీ, మెయిన్‌గానీ.. అభ్యర్థి సివిల్ సర్వీసెస్ కెరియర్‌కు సరిపోతాడా లేదా అనే విషయంలో స్పష్టతను అందించలేవు. అభ్యర్థి ప్రవర్తనాపరమైన లక్షణాలను తెలుసుకునే విధంగా రాత పరీక్షలో ప్రశ్నలు అడగలేరు. అభ్యర్థి అర్హుడో కాదో తెలుసుకోవడానికి పర్సనాలిటీ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆదర్శవంతమైన పద్ధతి.

మార్కులూ.. ర్యాంకులూ

గత కొన్నేళ్లుగా సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థుల మార్కులను విశ్లేషిస్తే...

1. టాపర్లు అందరూ మెయిన్స్‌లోనూ, ఇంటర్వ్యూలోనూ ఎక్కువ మార్కులు సాధించారు. (టాప్ 50 లేదా 100 ర్యాంకులు సాధించినవారు)
2. ఇంటర్వ్యూలో కొన్ని మార్కులు అధికంగా సాధించినా దానివల్ల 10 ర్యాంకుల కంటే ఎక్కువ తేడా వస్తుంది.
3. కొన్నిసార్లు ఇంటర్వ్యూలో 2 లేదా 3 మార్కులు తగ్గినా.. 3 లేదా 4 ర్యాంకులు తగ్గిపోతాయి. ఈ తేడా వల్ల ఐఏఎస్ దక్కకుండా ఇతర సర్వీసులకు పరిమితం కావాల్సి వస్తుంది.

అంచనా ఇలా..

అభ్యర్థులను సరిగా అంచనా వేయడానికి ఇంటర్వ్యూ బోర్డు కింది అంశాలను పరిశీలిస్తుంది.

- ప్రపంచంలో తన చుట్టూ జరుగుతోన్న ఘటనల పట్ల అభ్యర్థి ఆసక్తి కనబరుస్తున్నాడా? రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సామాజిక జీవితం, క్రీడలు, ఆరోగ్యం మొదలైన రంగాల్లోని తాజా పరిణామాలను పరిశీలిస్తున్నారా? వర్తమాన విషయాలను వార్తాపత్రికలను చదివి తెలుసుకుంటున్నారా లేదా?
- వార్తలను విశ్లేషించి సరైన నిర్ధారణకు వస్తున్నారా.. లేదా?
- నిర్దిష్ట విషయం సమాజంపై ప్రభావం చూపేదా, సాధారణ అంశమా అనేది అంచనా వేయగలుగుతున్నారా?
- అతడి/ఆమె ప్రజెంటేషన్‌లో తగినంత స్పష్టత ఉందా?
- సమస్యల పట్ల దృక్పథం ఎలా ఉంది? ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశమా? ఆదర్శవాదమా?
- సమస్యలకు ఎంత వేగంగా ప్రతిస్పందిస్తున్నారు?
- సమస్యను సరిగా అర్థంచేసుకుని తన అభిప్రాయాన్ని వెల్లడించగలుగుతున్నారా? లేదా ఎక్కడో చదివినదాన్ని చిలకలాగా పల్లె వేస్తున్నారా?
- విషయాన్ని నిర్మాణాత్మక దృక్పథంతో చూస్తున్నారా? ఆశావాదమా.. .నిరాశావాదమా?
- మొండిఘటం అనే ముద్ర వేసుకుంటున్నారా? లేదా తన అభిప్రాయాన్ని మార్చుకునే దృక్కోణంతో ఉన్నారా?
- చాకచక్యంగా సమాధానాలు చెబుతున్నారనే అభిప్రాయాన్ని కలిగిస్తారా, నిర్దిష్టంగా పర్యవసానాల గురించి ఆలోచించకుండా స్పందిస్తారా?
- తొందరపాటుగా నిర్ధారణకు వచ్చేస్తారా, పూర్తి సమాచారం అందేవరకూ నిర్ణయాలను వాయిదా వేస్తారా?
- సహాయపడటానికి పరిధి దాటి వ్యవహరిస్తారనే అభిప్రాయం కలిగిస్తారా, పరిధికి లోబడి తన విధులను నిర్వర్తిస్తారా?
- మొత్తానికి అధికారిగా విజయం సాధిస్తారా, సాధించరా?

ఎలా ముందడుగు వేయాలి?

ఇంటర్వ్యూ బోర్డు అభ్యర్థులను తికమక పెడుతూ సందిగ్ధ పరిస్థితిలో పడేయాలని ప్రయత్నిస్తుందనుకుంటారు చాలామంది. కానీ ఇది నిజం కాదు. మీరు ఆశిస్తున్న ఉద్యోగానికి మీరెంత వరకూ అర్హులనే విషయంలో ఒక అంచనాకు రావాల్సిన బాధ్యత బోర్డుకు ఉంటుంది. ఇంటర్వ్యూ సందర్భంగా...

■ సహజంగా ఉండాలి. మీ వైఖరిలో విశ్వాసం కనిపించాలిగానీ మొండితనం కాదు. ఉద్యోగం చేయగలరనే నమ్మకం మీ మీద మీకే లేనప్పుడు బోర్డుకు కలుగుతుందని అనుకోకూడదు. మీ బలహీనతల గురించి క్షమాపణలు చెప్పకూడదు. మీ బలాలను బహిర్గతపరచడానికి ప్రయత్నించాలి. బోర్డు సానుకూల ప్రదర్శనకు ఆసక్తి చూపిస్తుందిగానీ ప్రతికూల ప్రదర్శనకు కాదు. మొండిగా ప్రవర్తిస్తే బోర్డు సభ్యులెవరికైనా కోపం వస్తుంది. అవాస్తవమైన బలాలను ప్రదర్శిస్తూ, బలహీనతలకు ముసుగువేయాలని చూడకూడదు.

■ సౌకర్యంగా, నిటారుగా కూర్చోవడం సాధన చేయాలి. అలాగని మరీ బిగుసుకుపోకూడదు. నిర్లక్ష్యంగా కూర్చోవడం వల్ల ఇతర విషయాల్లోనూ అలాగే ఉంటారనే అభిప్రాయం కలుగుతుంది. ఈ సందర్భం ప్రాధాన్యాన్ని మీరు గుర్తించనట్టుగా అభిప్రాయపడతారు.

■ చర్చనీయాంశాన్ని జోక్‌గా తీసుకోకూడదు. పొడిపొడిగా మాట్లాడకూడదు. మీ వైఖరి సివిల్స్ స్థాయికి తగినట్టుగా ఉండాలి. బోర్డుకు అందుబాటులో ఉండే సమయం చాలా తక్కువ. ఆ సమయాన్ని వాళ్లు వృథా చేయాలని అనుకోరు. అలాగే మీరు కూడా వృథా చేయకూడదు.

■ అనుభవం, నైపుణ్యాల గురించి అతిశయంగా మాట్లాడకూడదు. మెయిన్స్ దరఖాస్తులోని సమాచారం, ఇతర విషయాల ఆధారంగా మీ గురించి కొంత సమాచారాన్ని ఇంటర్వ్యూ ముందు రాయమని అడగొచ్చు. మీ గురించి ఎక్కువగా తెలుసుకోవాలని బోర్డు అనుకోవచ్చు.

■ ఆధిపత్యం ప్రదర్శించకూడదు. అంతా మీరే అయ్యి మాట్లాడాలని అనుకోకూడదు. బోర్డు మిమ్మల్ని చాలా ప్రశ్నలు అడగాల్సి ఉంటుంది. మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పడానికే మొత్తం ఇంటర్వ్యూ సమయాన్నంతా వెచ్చించకూడదు.

■ ఇంటర్వ్యూకు సమారుగా అరగంట సమయం ఉండొచ్చు. కాబట్టి మీ దృష్టిని మొత్తం ఇంటర్వ్యూ మీదే కేంద్రీకరించాలి. ఏదైనా సమస్య లేదా ప్రశ్నను అడిగినప్పుడు ఆ సభ్యుడి మీదే ఏకాగ్రత ఉండాలి. అతడిని ఉద్దేశిస్తూ సమాధానం చెప్పాలి. అదే సమయంలో మిగతావారిని పూర్తిగా విస్మరించకూడదు.

■ అంతరాయం కలిగించొద్దు. ఒక సమస్యను గురించి విశ్లేషించమని బోర్డు సభ్యుడు మీకు సూచిస్తూ ఉండొచ్చు. ఈలోగానే మీరు మధ్యలో కల్పించుకుని అంతరాయం కలిగించకూడదు. సమస్యను గురించి వివరించి.. ప్రశ్న అడిగే వరకూ ఆగాలి.

■ ప్రశ్నను అర్థంచేసుకోవాలి. ప్రశ్న పూర్తిగా అర్థమయ్యేంతవరకూ సమాధానం చెప్పడానికి ప్రయత్నించకూడదు. వివరంగా లేకపోయినట్లయితే బోర్డు సభ్యుడిని అడగాలి. అంతేగానీ చిన్న విషయాల్లో మొండిగా ప్రవర్తించకూడదు.

■ హడావిడిగా కాకుండా వెంటనే సమాధానం చెప్పాలి. ఓరల్‌బోర్డ్ రేటింగ్ షీట్‌లో.. 'అభ్యర్థి వెంటనే సమాధానం చెప్పాడు'. 'అభ్యర్థి సమాధానం చెప్పడానికి జంకాడు'. అని రాస్తూ ఉంటారు. కాబట్టి వీలైనంత త్వరగా సమాధానం చెప్పడానికి ప్రయత్నించాలి. కానీ చెప్పాలనే తొందరలో పొరపాటు సమాధానం చెప్పకూడదు.

■ సమాధానం క్లుప్తంగా ఉండొచ్చు. కానీ సమాధానంలోనే మళ్లీ ప్రశ్న ఉండకూడదు. ఇలాచేస్తే మీరే నష్టపోతారు. మీ సమాధానం కంటే వేగంగానే బోర్డు సభ్యుడు మరో ప్రశ్న వేయగలరు.

■ బోర్డు సభ్యులకు నచ్చే విధంగా సమాధానాన్ని మలచకూడదు. అలా సమాధానాలు చెబితే.. దాన్ని గుర్తిస్తారు. ఈ పద్ధతి మీ స్థాయిని దిగజారేలా చేస్తుంది.

■ తరచూ బోర్డు సభ్యులెవరైనా మీకు విరుద్ధంగా మాట్లాడుతుండవచ్చు. ఇలాచేస్తూ మీ అభిప్రాయాన్ని మీరు సమర్థిస్తారో లేదో తెలుసుకుంటారు. చర్చ మొదలుపెట్టకూడదు. అలాగే అర్థాంతరంగానూ ఆపేయకూడదు. రక్షణాత్మకంగా వ్యవహరించి మీ అభిప్రాయాన్ని సమర్థించుకోవాలి. మొండితనానికీ రక్షణాత్మకంగా వ్యవహరించడానికీ మధ్య సన్నటి విభజన రేఖ ఉంటుంది. దాన్ని చెరిపేయకూడదు.

■ మీరొక ప్రకటన చేసి తర్వాత.. దాంట్లో తప్పును గుర్తించినట్లయితే దాన్ని ఒప్పుకోవాలి. తొందరగా చెప్పాలనే కంగారులో తప్పు చేశారని, ఆ తర్వాత దాన్ని తెలుసుకున్నారనే విషయాన్ని బోర్డు గుర్తిస్తుంది.

■ మీరు ఉద్యోగం చేస్తున్నట్లయితే మొదటి ప్రశ్న దానికి సంబంధించినదే ఉంటుంది. సమాధానం చెప్పాలిగానీ దానిపైన ఎక్కువ చర్చ జరగకుండా చూడాలి. కొత్త ఉద్యోగానికి మిమ్మల్ని పరీక్షిస్తారుగానీ ప్రస్తుతం చేస్తున్న దానికి కాదు. చేయబోయే ఉద్యోగం పైనే దృష్టిని కేంద్రీకరించి సమాధానాలు చెప్పాలి.

■ మితిమీరిన వ్యాఖ్యలు చేయకూడదు. సమాధానాలు సూటిగా, స్పష్టంగా ఉండాలి. వ్యక్తిగత అనుభవాల నుంచి ఉదాహరణ చెప్పాలన్నా దాన్ని కుదించి చెప్పాలి. ప్రాధాన్యంలేని అంశాలను వదిలేయాలి.

ఇంటర్వ్యూలో మీ ప్రదర్శన బాగుండాలనే బోర్డు కోరుకుంటుంది. మీరు ఒత్తిడికి గురవుతారనీ వారికి తెలుసు. కానీ అలాంటి పరిస్థితులను అధిగమించి మీరెలా సమాధానం చెబుతారనే విషయాన్ని గమనిస్తారు. సంతృప్తికరమైన ప్రదర్శన ద్వారా సివిల్ సర్వీసెస్ ఉద్యోగానికి మీరు సరిపోతారనే భరోసాను బోర్డుకు కల్పించాల్సిన బాధ్యత మీదే. సరైన సన్నద్ధత ఉంటే అది మీ ప్రదర్శన మెరుగ్గా ఉండటానికి తోడ్పడుతుంది.

– వి.గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

ఐదు అంశాలు

సివిల్స్ ఇంటర్వ్యూలో అభ్యర్థులు ఐదు అంశాల నుంచి ప్రశ్నలను ఆశించవచ్చు.

1 వ్యక్తిగతం: పేరు, ఏ ఊరు నుంచి వచ్చారు, అది ఏ జిల్లాలో ఉంది, ఆ జిల్లా రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతుల గురించి అడిగే అవకాశం ఉంటుంది. 'ప్రభుత్వ రంగంలో కెరియర్‌ను ఎందుకు ఎంచుకున్నారు' అనే అంశం పైనా ప్రశ్నించే అవకాశముంది.

2 విద్యాపరంగా: ప్రాథమిక విద్యార్హతలకు సంబంధించిన ప్రశ్నలూ అడగొచ్చు. కోర్సు పూర్తవటానికీ, సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరుకావడానికీ మధ్య ఎక్కువ విరామం వస్తే గ్రాడ్యుయేషన్‌లోని కోర్ సబ్జెక్టులను పునశ్చరణ చేసుకోవాలి. విద్యార్హతలకు సంబంధంలేని ఆప్షనల్‌ను ఎంచుకున్నవారు మరింతగా సబ్జెక్టు పరిజ్ఞానం పెంచుకోవాలి. ఆ రంగంలో తాజా పరిణామాల అవగాహన మరింత ముఖ్యం.

3 ఆప్షనల్ సబ్జెక్టు: దీంట్లో లోతైన ప్రశ్నలను సంధించే అవకాశం తక్కువ. మెయిన్ పరీక్షలో అభ్యర్థులు ఎలాగూ వివరణాత్మక సమాధానాలు రాస్తారు. అయినప్పటికీ కొన్ని ప్రాథమిక ప్రశ్నలూ, తాజా పరిణామాలను గుర్తుపెట్టుకోవాలి.

4 వర్తమాన అంశాలు: ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలను గురించి అడగొచ్చు. అందుకని ప్రతి రోజూ వార్తలను విశ్లేషించుకోవడం అవసరం.

5 అభిరుచులు: ఖాళీ సమయంలో ఏంచేస్తారని ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. మీకె లాంటి హాబీలూ లేనట్లయితే నిజాయతీగా చెప్పేయాలి. ఉంటే.. దానికి సంబంధించి అడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలి.

ప్రశ్నల స్వభావంలో గత కొన్నేళ్లుగా కొంత మార్పు వచ్చింది. అభ్యర్థి 'నిజమైన వ్యక్తిత్వాన్ని' వెలికితీసే విధంగా యూపీఎస్‌సీ ప్రశ్నలను సంధిస్తోంది. నిగ్వేకర్ కమిటీ సూచనల మేరకు.. అభ్యర్థి, ప్రవర్తన, వ్యక్తిత్వం, విలువ ఆధారిత ప్రశ్నలు అడగడానికి ఇంటర్వ్యూ బోర్డు ప్రయత్నిస్తోంది.

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

మహిళా శిశు సంక్షేమశాఖలో..

నెల్లూరులోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం- ఒప్పంద ప్రాతిపదికన ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- జిల్లా కోఆర్డినేటర్: 01
- ప్రాజెక్ట్ అసిస్టెంట్: 01
- బ్లాక్ కోఆర్డినేటర్: 10

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 42 ఏళ్ల మించకూడదు.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, దర్గామిట్ట, నెల్లూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా' చిరునామాకు పంపించాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23-12-2023.
వెబ్‌సైట్: https://spsnellore.ap.gov.in/notice_category/recruitment/

మెడికల్, పారామెడికల్ పోస్టులు

కాకినాడలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో 76 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- మెడికల్ ఆఫీసర్: 18
- స్టాఫ్ నర్స్: 43
- ల్యాబ్ టెక్నీషియన్: 06
- సీనియర్ టీబీ ల్యాబొరేటరీ: 01
- క్వాలిటీ మేనేజర్: 01
- ఆడియో మెట్రిషియన్: 03
- ఫార్మసిస్ట్: 02
- ఎల్‌జీఎస్: 02

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, ఎంబీబీఎస్. **దరఖాసుకు చివరి తేదీ:** 15-12-2023.
వెబ్‌సైట్: https://eastgodavari.ap.gov.in/notice_category/recruitment/

సెయిల్ సంస్థలో 92 మేనేజ్‌మెంట్ ట్రైనీలు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్త సెయిల్ స్టీల్ ప్లాంట్లు/ యూనిట్లు, గనుల్లో 92 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
విభాగాలు: కెమికల్ ఇంజినీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మెటలర్జికల్, మైనింగ్ ఇంజినీరింగ్.
అర్హత: 65% మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ. **వయసు:** 31-12-2023 నాటికి ఎస్సీ/ ఎస్టీలకు 33 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులు 31 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు రుసుము: ఓబీసీ అభ్యర్థులకు రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు రూ.200.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.12.2023.
వెబ్‌సైట్: https://www.sail.co.in/en/home

అప్రెంటిస్‌షిప్

ట్రేడ్, గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు

ఫరీదాబాద్ (హరియాణా)లోని ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ వివిధ విభాగాలు/ ట్రేడుల్లో 70 అప్రెంటిస్‌షిప్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. టెక్నీషియన్ అప్రెంటిస్
3. ట్రేడ్ అప్రెంటిస్

గ్రాడ్యుయేట్/ టెక్నీషియన్ విభాగాలు: ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐటీ/ కంప్యూటర్ ఆపరేటర్-కమ్-ప్రోగ్రామింగ్ అసిస్టెంట్.
ఐటీఐ ట్రేడ్: ఎలక్ట్రీషియన్, లైన్‌మెన్/ వైర్‌మ్యాన్, పవర్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెకానిక్ (మోటార్ వెహికల్), మేసన్ (బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్).
అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ.
శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.12.2023.
వెబ్‌సైట్: https://www.nhpcindia.com/
ఆన్‌లైన్ దరఖాస్తు: https://portal.mhrdnats.gov.in/boat/login/user_login.action

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విశాఖపట్నం, హైదరాబాద్‌లలో

మార్కెటింగ్

సంస్థ: స్కైలార్క్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ **స్టైపెండ్:** నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: 15, డిసెంబరు
అర్హతలు: మార్కెటింగ్, మార్కెట్ అనాలిసిస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/d65b26

వర్క్ ఫ్రమ్ హోమ్ మార్కెట్ రిసెర్చ్

సంస్థ: విట్రినా ఏఐ
స్టైపెండ్: నెలకు రూ.7,000
దరఖాస్తు గడువు: 22, డిసెంబరు
అర్హతలు: బిజినెస్ రిసెర్చ్, డేటా అనలిటిక్స్, డేటా స్ట్రక్చర్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
☛ internshala.com/i/e5e16b

మెషిన్ లెర్నింగ్

సంస్థ: ఏఐటూర్ **స్టైపెండ్:** నెలకు రూ.22,000
దరఖాస్తు గడువు: 22, డిసెంబరు
అర్హతలు: డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, పైతాన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/d29907

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్ **స్టైపెండ్:** నెలకు రూ.1,500
దరఖాస్తు గడువు: 22, డిసెంబరు
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/059858

క్వాలిటీ అస్యూరెన్స్ (కంటెంట్)

సంస్థ: క్విజీ **స్టైపెండ్:** నెలకు రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: 22, డిసెంబరు
అర్హతలు: ఇంగ్లిష్ రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎస్ఈఓ నైపుణ్యాలు
☛ internshala.com/i/be4d6e

సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ (మ్యాథ్స్)

సంస్థ: లెర్న్‌యాజ్‌యూగో **స్టైపెండ్:** నెలకు రూ.6,000-12,000
దరఖాస్తు గడువు: 21, డిసెంబరు
అర్హతలు: మేథమెటిక్స్ నైపుణ్యం
☛ internshala.com/i/67025d

ఇంజినీరింగ్ డిప్లొమా మీకుందా?

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ) సంస్థకు చెందిన మైనింగ్ లిమిటెడ్ 114 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి, ఇంజినీరింగ్ డిప్లొమా పాసైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, స్కిల్/ కాంపిటెన్సీ పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పదో తరగతి, ఇంజినీరింగ్ డిప్లొమా అర్హతలతో 7 రకాల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉంటేనే దరఖాస్తు చేయాలి.

ఎన్‌టీపీసీ మైనింగ్‌లో అవకాశాలు

1. మైనింగ్ ఓవర్‌మ్యాన్: 52 ఖాళీలు. ఫుల్‌టైమ్ రెగ్యులర్ మైనింగ్ డిప్లొమా 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు పాసైతే సరిపోతుంది. ఓవర్‌మ్యాన్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.

2. మేగజైన్ ఇన్‌ఛార్జ్: 7 ఖాళీలు. మైన్ ఓవర్‌మ్యాన్ ఉద్యోగానికి వర్తించే విద్యార్హతలే ఈ పోస్టుకూ వర్తిస్తాయి.

3. మెకానికల్ సూపర్‌వైజర్: 21 ఖాళీలు. మెకానికల్/ ప్రొడక్షన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో డిప్లొమా పాసవ్వాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు పాస్ మార్కులు సరిపోతాయి.

4. ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్: 13 ఖాళీలు. ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిప్లొమా 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీలకు పాస్ మార్కులు సరిపోతాయి. ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి.

5. ఒకేషనల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్: 3 ఖాళీలు. మైనింగ్/ ఎలక్ట్రికల్/ మెకానికల్ డిప్లొమా 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు పాసైతే చాలు. ఓవర్‌మ్యాన్/ ఫోర్‌మ్యాన్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ, ఫస్ట్‌ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి. మైన్స్‌లో 5 ఏళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.

6. జూనియర్ మైన్ సర్వేయర్: 11 ఖాళీలు. మైన్ సర్వే/ మైనింగ్ ఇంజినీరింగ్/ మైనింగ్ అండ్ మైన్ సర్వేయింగ్/ సివిల్ డిప్లొమా 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు పాస్ మార్కులు సరిపోతాయి. సర్వే సర్టిఫికెట్ ఉండాలి.

7. మైనింగ్ సర్దార్: 7 ఖాళీలు. మెట్రిక్/ పదో తరగతి పాసై, మైనింగ్ సర్దార్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.

దరఖాస్తు ఫీజు రూ.300 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్-సర్వీస్‌మెన్/ భూనిర్వాసితులు/ మహిళలకు ఫీజు లేదు. అన్ని పోస్టులకూ గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు. ఒకేషనల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగానికి మాత్రం 40 సంవత్సరాలు. గరిష్ఠ వయసులో.. ఓబీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, భూనిర్వాసితులకు 5 ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సడలింపులు వర్తిస్తాయి.

ఎంపిక మొదటి దశలో..

100 మార్కులకు రాత పరీక్షను నిర్వహిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు 1 మార్కు చొప్పున కేటాయించారు. ప్రతి తప్పు సమాధానానికీ 0.25 మార్కు తగ్గిస్తారు. జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రాత పరీక్షలో 40 శాతం, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ అభ్యర్థులు 30 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. దీంట్లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను రెండో దశకు ఎంపిక చేస్తారు.
రెండో దశలో: సంబంధిత విభాగంలో స్కిల్/ కాంపిటెన్సీ టె